క్లుప్తంగా

అటవీశాఖ ఉద్యానవనంలో వన మహోత్సవం



మొక్క నాటుతున్న అధికారులు

రామగుండం: 'వనం నాటితే జనానికి మేలు జరుగుతుందని, నేడు మనం నాటిన మొక్క రేపటి తరానికి ఎంతో ఉపయోగపడతాయి' అని అటవీ అధికారులు అన్నారు. రామగుండంలోని అటవీశాఖ ఉద్యానవనంలో వన మహోత్సవం నిర్వహించారు. సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డి కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడారు. వాతావరణంలో పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు మొక్కలు నాటడం నిరంతర ప్రక్రియగా కొనసాగాలన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సతీశ్, బీట్ ఆఫీసర్ ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

రామగిరి: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన మహమ్మద్ మోయినుద్దీన్‌కు రూ.2.50లక్షల విలువ గల చెక్కు అందజేశారు. మోయినుద్దీన్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ సహాయం కోసం మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఎల్‌వోసీని మంత్రి సహాయకులు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

తెలుకుంటలో బీఆర్‌ఎస్ సమావేశం

జూలపల్లి: మండలంలోని తెలుకుంటలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు చొప్పరి శేఖర్ అధ్యక్షతన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యం ప్రతీ కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని ఆరోపించారు. సమావేశంలో నాయకులు తమ్మడవేని మల్లేశం, కంది చొక్కారెడ్డి, నేవూరి మల్లేశం, చిప్ప రమేశ్, బొద్దుల కైలాసం, నల్లల స్వామి, తీగల అంజయ్య, విద్యాకుమార్, రవీందర్‌రెడ్డి, గొడిసెల రవి, చొప్పరి నర్సింగం ఉన్నారు.

పద్మశాలీ సంఘం కార్యవర్గం ఎన్నిక



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

ఎలిగేడు: ఎలిగేడు పద్మశాలీ సంఘం గ్రామ కమిటీని ఆ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్‌నేత ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కోడూరి ససత్యనారాయణ(వంటల), ప్రధాన కార్యదర్శిగా గ్యాంగి నాగరాజు, ఎలిగేడు యువజన సంఘం అధ్యక్షుడిగా గుండేటి మురళి, ప్రధాన కార్యదర్శిగా వంగ సాగర్‌ను ఎన్నుకున్నారు. మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, మాజీ అధ్యక్షుడు బూర్ల వెంకటసత్యం, ఉపాధ్యక్షుడు ఊసకోయిల భూపతి, కోశాధికారి కట్ల సత్యం, వెంగళదాసు రాజమౌళి, సుంక సంతోష్, వెంగళదాసు భాస్కర్, బూర్ల జనార్దన్, బూర్ల రాజేశం, కుసుమ రమేశ్, గుంటేటి తిరుపతి, దూడం వీరేశం, సుంక శ్రీధర్, కోడూరి శ్రీనివాస్, కైలాసం, సుంకనపల్లి అంజయ్య, కోడూరి సత్యం(అకౌంట్స్), గౌరవ అధ్యక్షుడు మామిడాల రమేశ్ పాల్గొన్నారు.

విద్యార్థికి సన్మానం

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన హర్షవర్ధన్ రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక కావడంతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఆదివారం కరాటే మాస్టర్ జింగిరి సతీశ్ కుమార్ కుమారుడు హర్షవర్ధన్‌ను సన్మానించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఐల రమేశ్, మంద శ్రీనివాస్‌గౌడ్, అమిరిశెట్టి రాజలింగం, తిరుపతి, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొమురవెల్లి భాస్కర్, వేణు, సుమన్, కామణి శ్రీకాంత్, మల్లేశం, కుమార్, రవీందర్, ఉల్లంగుల శ్రీనివాస్, సిరిపురం రమేశ్, పల్ల సురేశ్, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, వీరాచారి, ప్రశాంత్, రమణ, ప్రవీణ్, షేక్, రాజు, కొమురయ్య, ప్రకాశ్, సుధాకర్, బిక్షపతి, శ్రీనివాస్, లింగమూర్తి, రామచంద్రం, ఎల్లయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని జెండా ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా విద్యుత్ స్తంభాల మరమ్మత్తు పనులు చేపట్టనున్నట్లు ఏఈ చంద్రగిరి శ్రీనివాస్ తెలిపారు. ఈ కారణంగా సోమవారం ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.



ఆదమరిస్తే ఇక అంతే..

మంథనిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే చిన్నారులు సంచరించే పాఠశాల ఆవరణలో ప్రమాదాలు పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మంథని మండలం గుంజపడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో కప్పు లేని వాటర్ సంప్ ప్రమాదకరంగా ఉంది. గతేడాది వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం నిర్మించిన సంప్‌కు మూత వేయకుండా వదిలేశారు. దీంతో పిల్లలు ఆడుకుంటూ ఆదమరచి అటువైపు వెళ్తే ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వాటర్ సంపుపై కప్పు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలు తొలగించండి

జ్యోతినగర్: 'మున్సిపల్ సార్లూ మా బాధను ఆలకించండి'. వానాకాలంలో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలు సంచరిస్తున్నాయి. రామగుండం కార్పొరేషన్ ఐదో డివిజన్ నర్రాశాలపల్లెలోని అంతర్గత రోడ్లలో ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగి రోడ్డు కనిపించడం లేదు. ఉదయం, రాత్రివేళల్లో పెరిగిన పిచ్చిమొక్కల పొదల్లో పాములు సంచరిస్తున్నాయి. సంబంధిత మున్సిపల్‌శాఖ అధికారులు స్పందించి అంతర్గత రోడ్లలో ఉన్న పొదలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రమాదమని తెలిసినా తప్పని ప్రయాణం

ఫెర్టిలైజర్‌సిటీ: గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ పనులు జోరందుకోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో కూలీల కొరత అధికంగా ఉంది. దీంతో గోదావరిఖని ప్రాంతం నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వరినాట్లు, పత్తి గింజలు నాటేందుకు ఆటోల్లో గ్రామీణ ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రమాదమని తెలిసినా ట్రాలీ ఆటోలో సుమారు 45 మంది ప్రయాణం చేస్తున్నారు. గత రబీ సీజన్‌లో జిల్లాలో ట్రాలీ ఆటోలో వ్యవసాయ కూలీలను తరలించే క్రమంలో లారీ ఢీకొనడంతో ఆటో ట్రాలీలో ప్రయాణిస్తున్న కూలీలు తీవ్ర గాయాలపాలయ్యారు. ఇలాంటి ఘటనలు జరుగుతున్నా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఆటోలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

రామగుండం: రామగుండంలోని జెడ్పీ హైస్కూల్‌లో 1988–89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళం ఘనంగా జరుపుకున్నారు. రామగుండం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థి సినీ నటుడు, మిమిక్రీ ఆర్టిస్టు శివారెడ్డి సందడి చేశారు. పూర్వ విద్యార్థులు దాదాపు 37ఏళ్ల తర్వాత ఒక చోట చేరి, చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కాసం హరిప్రసాద్, నర్సింగరావు, నాగస్వామి, యూసుఫ్, కుసుమ కుమారి, నీరజ, వసంత పాల్గొన్నారు.



జ్యోతినగర్: గోరింటాకు సంబరాల్లో మహిళలు



రామగిరి: వేడుకల్లో మహిళలు


గోరింటాకు సంబరాలు

జ్యోతినగర్: 'ఆకుపచ్చని గోరింట.. ఆరోగ్యాల గోరింట' అంటూ మహిళలు చేతులకు గోరింటాకు పెట్టుకుని వేడుకలు జరుపుకున్నారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని శ్రీసీతారామ సేవాసమతి (వాట్సాప్ గ్రూప్) సభ్యులు ఆదివారం గోరింటాకు సంబరాలు జరుపుకున్నారు. గోలివాడ చంద్రకళ, కంది సుజాత, వనజ, ఇందారపు సునీత, కొండు రమ, జమున, శశికళ, శ్యామల, ఫాతిమా, శాంతి, జ్యోతి, భాగ్యలక్ష్మి, వనిత, మమత, వీణ, గౌసియా పాల్గొన్నారు.

మారుతినగర్‌లో..

రామగిరి: మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని మారుతినగర్‌లో ఆదివారం గోరింటాకు పండుగను మహిళలు నిర్వహించారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ముత్యంరావు

మంథని: మున్సిపల్ కార్మికుల డిమాండ్ల సాధన కోసం 23న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పిలుపునిచ్చారు. మంథని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆదివారం కార్మికుల జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం 19న మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించాలని కోరారు. కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, 8గంటల పనిదినాలను 10గంటలకు మార్చిన జీవోను ఉపసంహరించుకోవాలనే డిమాండ్‌తో 23న హైదరాబాద్‌లోని మున్సిపల్ సీఎండీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు గట్టయ్య, చందు, రాజయ్య, జంపయ్య, సమ్మయ్య, భాగ్య, పోచమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• పంచాయతీ ఉద్యోగి మృతి

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లిలో ఆముదాల సమ్మయ్య (54) అనే గ్రామ పంచాయతీ ఉద్యోగి వారసంతలో లైట్లు సరిచేస్తుండగా జారిపడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలో శనివారం రాత్రి వారసంతలో గుడి గోడలపై విద్యుత్‌బల్బులు అమరుస్తుండగా కాలుజారి కింద పడి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య సారమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

• రైతుల సంక్షేమమే ధ్యేయం

పాలకుర్తి: మండల కేంద్రంలోని వరిపొలాల్లో నాట్లు వేస్తున్న మహిళా కూలీలను మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలి ఠాకూర్ ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా ఆమె వారితో కలిసి కొద్దిసేపు నాటు వేసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మాజీ ఎంపీపీ రమేశ్, అశోక్, లక్ష్మణ్, పాల్గొన్నారు.

• తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన గుర్రం శ్రీనివాస్‌గౌడ్ అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. గమనించిన తోటి గీత కార్మికులు చికిత్సకోసం శ్రీనివాస్‌గౌడ్‌ను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాస్‌గౌడ్‌కు తొంటి విరగడంతోపాటు తలకు, ఛాతిలో బలమైన గాయాలైయినట్లు గీత కార్మికులు తెలిపారు. శ్రీనివాస్‌గౌడ్‌కు తక్షణసాయం కింద రూ.15వేలతోపాటు ఎక్స్‌గ్రేషియా అందించాలని సర్వాయి పాపన్న మోకుదెబ్బ గౌడ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వేగోళం శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సుల్తాన్‌పూర్ గౌడసంఘం అధ్యక్షులు పల్లె వీరయ్యగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు.

• పెగడపల్లిలో..

కాల్వశ్రీరాంపూర్: తాటి చెట్టుపై నుంచి పడి గీత కార్మికునికి గాయాలైన ఘటన మండలంలోని పెగడపల్లిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం గీత కార్మికుడు గోపగాని రాజమల్లుగౌడ్ తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. కాళ్లకు, చేతులకు, తలకు తీవ్రగాయాలు కాగా మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు.

• బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా రాములు

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన పిల్లలమర్రి రాములు బీజేపీ మండల ఉపాధ్యక్షుడిగా ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉప్పుల కుమార్, చిలువేరు సదయ్య, నార్ల రాజయ్య, గురుజాల గణపతిరెడ్డి, పూర్ణం చంద్రయ్య, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

• ట్రాక్టర్, ఆటో ఢీ.. ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం: మండలంలోని మచ్చుపేట ప్రధాన రహదారిపై ఆదివారం రాత్రి ట్రాక్టర్, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కేశనపల్లికి చెందిన పోశాని పాపయ్య తమ ఆటోలో బేగంపేట నుంచి ఇంటికి వస్తున్నాడు. మచ్చుపేటకు చెందిన కలవేన దేవరాజు ట్రాక్టర్ మచ్చుపేట నుంచి బేగంపేటకు వైపు వెళ్తుండగా కేశనపల్లికి వస్తున్న ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయాలైన పాపయ్యను చికిత్స నిమిత్తం ట్రాక్టర్‌కు సబంధించిన వ్యక్తి పెద్దపల్లి ఆస్పత్రికి తరలించారని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలాన్ని బ్లూకోల్ట్స్ పోలీసు అశోక్ పరిశీలించారు.

• ఆయన నేత్రాలు సజీవం

పాలకుర్తి: కన్నాల బోడగుట్టపల్లికి చెందిన పుప్పాల నారాయణ(83) ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. కాగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. సదాశయ ఫౌండేషన్ మండల అధ్యక్షుడు భీమనపల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ నారాయణ నేత్రాలను సేకరించారు.

• అపోహలు వీడండి.. నేత్రదానం చేయండి

కోల్‌సిటీ: గోదావరిఖని కేసీఆర్ కాలనీకి చెందిన హన్మంతు ఈనెల 3న అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదాత సంస్మరణ సభ నిర్వహించారు. మృతుని కుటుంబ సభ్యులకు ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, ఫౌండేషన్ సలహాదారులు రాములు సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రం అందజేసి అభినందించారు.

డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్‌కు సన్మానం



సన్మానిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్ వన్ ఏరియాలో డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్‌గా పనిచేస్తూ బదిలీపై ఆర్జీ–3 ఏరియాకు వెళ్తున్న శ్రీహర్షను ఆదివారం ఘనంగా సన్మానించారు. డిప్యూటీ ఫైనాన్స్ మేనేజర్ క్రాంతికుమార్, నాయకులు ఇజ్జగిరి రాజు, బి.పద్మ, జి.సుజిత్‌కుమార్, ఎం.మదన్, వెంకటేశ్ పాల్గొన్నారు.

అధికారికి సన్మానం



సన్మానిస్తున్న వాకర్ అసోసియేషన్ సభ్యులు

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన కలగూర విజయ్‌కుమార్ ఆదిలాబాద్ మున్సిపల్ డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి పొందారు. దీంతో ఆయనను సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు.

ఓసీపీ–3లో కార్మికునికి తీవ్రగాయాలు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2 పరిధిలోని ఓసీపీ–3లో జరిగిన ప్రమాదంలో గొట్టె శ్రావణ్ జనరల్ అసిస్టెంట్ ఆదివారం గాయపడ్డారు. మిడిల్ షిఫ్టులో విధులు నిర్వహిస్తున్న సమయంలో డీజిల్ బోజర్ వాహనం బ్రేకులు ఫెయిలయ్యాయి. అయితే వాహనం వెనక్కి వెళ్లకుండా టైర్ల కింద సపోర్టు పెడుతున్న సమయంలో బోజర్ వెనక్కివచ్చి గాయాలయ్యాయి. బ్రేకుల ఎయిర్ కనెక్షన్ సరిచేస్తున్న క్రమంలో బోజర్ వెనక్కి రావడంతో శ్రావణ్ తల, ఎడమ పక్కటెముకలకు గాయాలయ్యాయి. హుటాహుటిన యైటింక్లయిన్ కాలనీ డిస్పెన్సరీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం గోదావరిఖని ఏరియా ఆసుపత్రికి పంపించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. గాయపడిన కార్మికుడిని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, టీబీజీకేఎస్ నాయకులు ఐలి శ్రీనివాస్, ఏఐటీయూసీ నాయకులు శ్యాంసన్ పరామర్శించారు. కాగా కాలంచెల్లిన డీజిల్ బోజర్‌ను వినియోగించడంతో ఈ ప్రమాదం జరిగిందని, గతంలో కూడా డీజిల్ బోజర్లు ప్రమాదానికి గురయ్యాయన్నారు. వీటిని మార్చి కొత్త డీజిల్ బోజర్లను కొనుగోలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.



సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఎంఈవో, ట్రాన్స్‌కో కార్యాలయాల ఎదుట ఉన్న రోడ్డుపై భారీ గుంత ఏర్పడడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కార్యాలయాలకు వచ్చే ప్రజలు, అధికారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు గుంత పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు



సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల

సుల్తానాబాద్: కళాశాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం డైరెక్టర్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ లక్ష్మారెడ్డి నిధులు విడుదల చేశారు. ఇప్పటివరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నిధుల కేటాయింపు అంతంతే ఉండేది. విద్యార్థుల ఇబ్బందులను గమనించిన ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు ముందుకు వచ్చింది. గత నెల 27న ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని కళాశాలలకు రూ.206 లక్షలు కేటాయించింది. జిల్లాలో 14 కళాశాలలు ఉండగా 12 కళాశాలకు కేటాయించారు.

కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఫలితాలు

ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్ కళాశాలకు దీటుగా ఫలితాలు రావడంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యుత్, కళాశాల గదులు విద్యుదీకరణతో పాటు ఫ్యాన్లు, లైట్స్, ఫర్నిచర్, నీటి సరఫరా, పారిశుద్ధ్యం, బోర్‌వెల్‌తో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించనున్నారు.

రెండు కళాశాలలకు నిల్

జిల్లాలో పెద్దపల్లి, సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదాయం సమకూరేలా ఉన్న కళాశాలతో పాటు షాపింగ్ కాంప్లెక్స్ గదులకు నెలవారీగా ఆదాయం సమకూరుస్తుండడంతో వాటికి నిధులు కేటాయించలేదు. కళాశాలలకు పక్కా భవనాలతో పాటు కళాశాల డెవలప్ మెంట్ కమిటీ షాపింగ్ కాంప్లెక్స్ ఉన్నాయి.

నిధులు మంజూరయ్యాయి

జిల్లాలో 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం నిధులు మంజూరైనట్టు ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు తక్కువ నిధులు విడుదల చేశారు. గత నెల 27న నిధులు విడుదల చేశారు.

– కల్పన, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి, పెద్దపల్లి

బీసీలను నయవంచన చేసింది బీఆర్‌ఎస్సే



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: బీసీలను నయవంచన చేసింది బీఆర్‌ఎస్సే అని కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, మహంకాళి స్వామి, తిప్పారపు శ్రీనివాస్ ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ కామారెడ్డి సభలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్‌ను నిలుపుకోవడానికే 42శాతం రిజర్వేషన్లు బీసీల కోసం కేబినెట్ ఆర్డినెన్స్ తీసుకువచ్చిందన్నారు. కానీ బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం నయవంచన చేస్తుందంటూ మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కాల్వ లింగస్వామి, సుజాత, లక్ష్మణ్‌బాబు, రమేశ్ పాల్గొన్నారు.

17న సీపీఐ జిల్లా మహాసభలు

యైటింక్లయిన్‌కాలనీ: సీపీఐ ఏర్పడి వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈనెల 17న నిర్వహించనున్న పార్టీ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా పూర్వ కార్యదర్శి గౌతం గోవర్ధన్ కోరారు. యైటింక్లయిన్‌కాలనీలో కమాన్‌పూర్ మండల సీపీఐ ముఖ్య నాయకులతో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలో చేపట్టనున్న మహాసభలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కమాన్‌పూర్ మండల కార్యదర్శి రాజారత్నం, ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు ప్రకాశ్, ఆర్జీ–2 బ్రాంచ్ సెక్రటరీ రవీందర్, బుర్ర తిరుపతి, సత్యనారాయణగౌడ్, రాజయ్య పాల్గొన్నారు.

కత్తెరమల్ల రాయలింగుకు జాతీయ సేవారత్న అవార్డు



రామగుండం: తాళ్లపాక అన్నమచార్యుల జయంతి సందర్భంగా హైదరాబాద్ చిక్కడపల్లిలోని శ్రీత్యాగరాయ గానసభ కళా మందిరంలో శ్రీలంబోదర కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సోమనపల్లికి చెందిన కత్తెరమల్ల రాయలింగుకు జాతీయ సేవారత్న అవార్డు అందించారు. అకాడమీ నిర్వాహకులు డాక్టర్ నక్క లాస్య–అశోక్ నిర్వహించిన అవార్డు ప్రదానంలో రాష్ట్ర పోలీసు హౌసింగ్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్, బెల్లం సినీ హీరో విద్యాసాగర్ అవార్డు అందించారు.